క్లుప్తంగా

ఘనంగా వాకర్స్ అసోసియేషన్ వార్షికోత్సవం


సీనియర్ సిటిజన్స్‌ను సత్కరిస్తున్న సభ్యులు

భీమునిపట్నం: భీమిలి చిన్నబజారు సమీపంలోని జమ్మిచెరువు పార్కుకు సంబంధించి జమ్మి చెరువు అసోసియేషన్ ఆఫ్ వాకర్స్ ద్వితీయ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి హాజరైన ప్రముఖ న్యాయవాది ఎస్.జనార్దన్‌రావు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని, దానిని కాపాడుకునేందుకు వాకింగ్ చాలా మంచిదని పేర్కొన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ కందుకూరి రత్నాజీ, గుడ్ల సత్యనారాయణరెడ్డి, గుర్రాల పండరీనాథ్ తదితరులను ఘనంగా సత్కరించారు. ఇందులో సభ్యులు దత్తి ఈశ్వరరావు, శంకరకుమార్, కిలాన అప్పారావు, జోగారావు పాల్గొన్నారు.

పాలిసెట్ హాల్ టికెట్లు విడుదల

భీమునిపట్నం: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే పాలిసెట్ హాల్‌టికెట్లు విడుదలయ్యాయని భీమిలి మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీకృష్ణ గురువారం తెలిపారు. ఈ నెల 30వ తేదీన పరీక్ష జరగనున్న పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు polycetap.nic.in వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్‌ను పొందవచ్చని సూచించారు.

కోర్టుకు హాజరు కాని వ్యక్తికి ఏడాది శిక్ష

భీమునిపట్నం: జడ్జిమెంట్ రోజున కోర్టుకు హాజరుకాని వ్యక్తికి భీమిలి కోర్టు గురువారం ఏడాది జైలుశిక్ష, రూ.పదివేలు జరిమానా విధించింది. చేపలుప్పాడకు చెందిన కురందాసు కుమారి తన భర్త కురందాసు అప్పలరాజు వరకట్నం కోసం వేధిస్తున్నాడని కేసు పెట్టారు. ఈ కేసు కోర్టులో నడుస్తోంది. గత మార్చి 4వ తేదీన కేసుకు సంబంధించిన జడ్జిమెంట్ ఉండగా, అప్పలరాజు కోర్టుకు హాజరు కాలేదు. దీంతో కోర్టు అతడిపై నాన్ బెయిలబుల్ వారెంట్ (ఎన్‌బీడబ్ల్యూ) జారీ చేసింది. దీంతో పోలీసులు అప్పలరాజును అరెస్ట్ చేసి, కోర్టులో హాజరు పరచగా.. ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్ష, భార్యకు రూ.పదివేలు ఇవ్వాలని న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

ఘనంగా పంచాయతీ రాజ్ దినోత్సవం


గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్, మహాత్మాగాంధీ చిత్రపటాలకు ఎంపీపీ కంటుబోతు రాంబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాంబాబు మాట్లాడుతూ పంచాయతీ రాజ్ వ్యవస్థ గ్రామాల అభివృద్ధికి మూలమన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో జయ ఉమ, విద్యుత్‌శాఖ ఏఈ జగన్మోహనరావు, మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంపీఎస్ చలం పాల్గొన్నారు.

అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినికి సత్కారం


రేష్మను సత్కరిస్తున్న సత్యసాయి భజన మండలి సభ్యులు

తగరపువలస: పదో తరగతి పరీక్షల్లో 581 మార్కులు సాధించి, ఆనందపురం మండల స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచిన గొట్టిపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని తొగురోతు రేష్మను స్థానిక భజన మండలి ప్రతినిధులు గురువారం సత్కరించారు. గొట్టిపల్లి శ్రీసత్యసాయి ఇంటిగ్రేటెడ్ సేవా మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో మండలి ప్రతినిధులు డబ్బీరు విజయకుమార్, కోరాడ తమ్మునాయుడు, డీవీఎస్ సంతోష్ కిరణ్, ప్రమిదల వాసు, రెడ్డి రాము తదితరులు పాల్గొన్నారు.

అన్నార్తుల ఆకలి తీర్చాలనే మంచి ఆశయంతో ఒక దాత ఇచ్చిన భూములు అన్యాక్రాంతమైపోతున్నాయి. సంగివలస కొత్తమ్మవారి ఆలయ ఈవో పరిధిలో ఉన్న శ్రీలంగర్‌ఖానా సత్రం భూములు కాపాడుకోవడం అక్కడి ముగ్గురు అమ్మవార్ల వల్ల కూడా కాదేమో అన్నట్లుగా తయారైంది పరిస్థితి. కంచే చేను మేస్తున్నట్లు దేవదాయ శాఖ సిబ్బందే వీటికి ఎసరు పెడుతున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి.

సత్రం భూములు పరహస్తం

చేతులు మారుతున్న లంగర్‌ఖానా ఆస్తులు

సర్వే నంబర్లు మార్చి రిజిస్ట్రేషన్లు

సిబ్బందే సహకరిస్తున్నారని ఆరోపణలు


చిల్లపేట వద్ద ఇటీవల చదును చేసిన శ్రీలంగర్‌ఖానా సత్రం భూములు


జీరుపేట వద్ద ఆక్రమణదారుల చేతుల్లో శ్రీలంగర్‌ఖానా సత్రం భూములు

తగరపువలస: భీమిలిలోని శ్రీలంగర్‌ఖానా సత్రం భూములు చేతులు మారిపోతున్నాయి. సరైన పర్యవేక్షణ లేకపోవడం, భూముల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో క్రమేణా ఆక్రమణలు పెరిగిపోయాయి. సత్రానికి కేటాయించిన భూములన్నీ ఒకే ప్రాంతంలో లేకపోవడం అక్రమార్కులకు కలిసివచ్చింది. నెమ్మదిగా భూములను ఆక్రమించి, ముందుగా షెడ్లు వేసేస్తున్నారు.

అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా, వాటిని తొలగించి మరీ వీటిని ఆక్రమించేస్తున్నారు. దీంతో దాతల ఆశయానికి గండిపడడమే కాదు, దేవదాయశాఖకు ఆదాయం కూడా దక్కని పరిస్థితి ఎదురవుతోంది.

పట్టించుకునే నాథుడేడి?

గతంలో సంగివలస కొత్తమ్మ ఆలయంలో ఈవోతో పాటు ఇద్దరు సిబ్బంది ఉండి భూముల సంరక్షణ చూసుకునేవారు. ఆక్రమణలు జరిగినట్లు తెలిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పోలీసుల సాయంతో కూల్చేసేవారు. ప్రస్తుతం ఆలయంలో ఈ ఇద్దరు సిబ్బందిని బదిలీ చేయడంతో ఈవో తప్ప ఎవరూ లేరు. దీంతో చిల్లపేట, జీరుపేట, కుమ్మరిపాలెం, కొంకివీధి, రామజోగి అగ్రహారంలో జోరుగా ఆక్రమణలు జరిగి అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి. నెలల తరబడి నిర్మాణాలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడు లేకపోవడంతో శ్రీలంగర్‌ఖానా సత్రం భూములు రోజురోజుకు చిక్కిపోతున్నాయి. దేవదాయశాఖ రక్షణలో పేరుతో భూములు ఉన్నా ఇందులో సిబ్బంది ఆక్రమణదారులకు అండగా నిలబడి క్రయవిక్రయాలు జరిపిస్తూ నాలుగు రాళ్లు వెనకేసుకున్నట్టు ఆరోపణలు ఎక్కువగా వినిపిస్తున్నాయి.

అసలేంటీ సత్రం భూములు?

1851లో దేశం పరాయిపాలనలో ఉన్నప్పుడు భీమిలి నౌకాశ్రయంలో పని చేసే కూలీలు, పాదచారుల ఆకలి తీర్చడానికి అప్పట్లో శ్రీకృష్ణ పాండవ సంజీవయ్య అనే దాత సత్రం ఏర్పాటు చేసి, దాని నిర్వహణ కోసం 118 ఎకరాలు దానం చేశారు. ఇందులో చిట్టివలస సర్వే నంబర్ 61/1లో 67 ఎకరాలు, 61/3లో 0.69 సెంట్లు, భీమిలి కుమ్మరిపాలెం టౌన్ సర్వే నంబర్ 22లో 14 ఎకరాలు, కొంకివీధిలో 3 ఎకరాలు, నేరెళ్లవలస రెవెన్యూ పరిధిలోని రామజోగి అగ్రహారంలో 28 ఎకరాలు, మిగిలినవి భీమిలి పట్టణంలో సత్రాలు, కార్యాలయాల రూపంలో ఉండేవి. ఈ భూములు సాగు చేసుకునే రైతుల నుంచి వసూలయ్యే శిస్తుతో సత్రం నడిచేది. 1971 వరకు భీమిలి బ్లాక్ డెవలప్‌మెంట్ అధికారి పర్యవేక్షణలో శిస్తు వసూలు చేయగా 1972లో ఈ సత్రం భూములు దేవదాయశాఖకు అప్పగించారు. అయితే, కాలక్రమంలో సాగు మానేసిన రైతులు శిస్తు కూడా చెల్లించడం మానేశారు.


గతంలో ఆక్రమణలు కూల్చిన చోటే కొత్తగా నిర్మించిన దుకాణాలు


జీరుపేటలో గతంలో కూల్చివేసిన హెచ్చరిక దిమ్మె

చేతులు మారుతున్న భూములు

సంగివలస ఈవో పరిధిలో సిబ్బందికి ఈ భూముల సంరక్షణ బాధ్యతలు అప్పగించారు. అయినప్పటికీ వీరి చలవతో రైతులు సత్రం భూములను ముక్కలు ముక్కలుగా విక్రయించుకోవడం, శాశ్వత భవనాలు నిర్మించుకోవడం జరుగుతూనే వస్తోంది. చట్ట ప్రకారం రిజిస్ట్రేషన్ కాకపోవడంతో సర్వే నంబర్లు మార్చి సుమారు 6 ఎకరాల వరకు భూములు చేతులు మారిపోయాయి. ముందు షెడ్లు, తరువాత విద్యుత్ మీటర్లు, రెడీమేడ్ ఫెన్సింగ్, విక్రయాలు, తోటల పెంపకం వంటి అక్రమాలు నిరంతరం జరుగుతునే ఉన్నా.. సిబ్బంది కొరత సాకుతో దేవదాయశాఖ సిబ్బంది వ్యక్తిగత ఆస్తులు పెంచుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. శ్రీలంగర్‌ఖానా సత్రం భూములకు సిబ్బందే ఎసరు పెడుతున్నా ఉన్నతస్థాయి అధికారులు మాత్రం చుట్టపుచూపుగా వచ్చి చూసిపోతున్నారు తప్ప చర్యలు తీసుకోవడం లేదు.

ఆగని నిర్మాణాలు

1971 వరకు సుమారు 40 మంది వరకు రైతులు బ్లాక్ డెవలప్‌మెంట్‌కు శిస్తులు చెల్లించేవారు. ఇటీవల దేవదాయశాఖ సిబ్బంది శిస్తులు చెల్లించాలని కోరినా రైతులు నిరాకరిస్తూ వస్తున్నారు. ఇదిలా ఉండగా దేవదాయశాఖ పరిధిలో ఉన్న ఈ భూముల విక్రయాలు చెల్లవని సిబ్బంది ఘంటాపథంగా చెబుతున్నా భూముల చేతుల మార్పిడి ఆగడం లేదు. మొక్కుబడిగా దేవదాయశాఖ అక్కడక్కడ నిర్మాణాలు కూల్చివేసినా, మళ్లీ పక్కనే సవాల్ విసురుతూ నిర్మాణాలు చేపడుతున్నారు. అంతేకాకుండా దేవదాయశాఖ ఆక్రమణదారులను హెచ్చరిస్తూ నిర్మించి దిమ్మెలు, బోర్డులను సైతం ఆక్రమణదారులు కూల్చివేస్తున్నారు. దాత సంజీవయ్య ఎంతో ఉదారంగా దానం చేసిన భూములు చిత్తశుద్ధి లేని దేవదాయశాఖ సిబ్బంది కారణంగా కళ్ల ముందే కరిగిపోతున్నాయి. ఇప్పటికైనా సర్వే చేపట్టి శ్రీలంగర్‌ఖానా సత్రం భూములను దేవదాయశాఖ రక్షించాలని భక్తులు, భీమిలి పట్టణ ప్రజలు కోరుతున్నారు.

దేముడు బాబుకు చిన్న శ్రీను నివాళి


దేముడు బాబు భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న చిన్న శ్రీను

పద్మనాభం: పాండ్రంగి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఆర్.ఎస్.దేముడు బాబు భౌతిక కాయానికి విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు గురువారం నివాళులర్పించారు. పాండ్రంగిలోని ఆయన నివాసానికి వెళ్లి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో విశాఖ జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్‌సీపీ పద్మనాభం మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, ఆనందపురం మండల అధ్యక్షుడు బంక సత్యం, వైఎస్సార్ సీపీ నాయకులు అముజూరి అప్పారావు, సిరుగుడి ఆదినారాయణ, ఈర్ల ఈశ్వరరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోరెడ్డి దామోదరరావు ఉన్నారు.

పహల్గాం మృతుడు చంద్రమౌళికి పెన్షనర్ల శ్రద్ధాంజలి


చిట్టివలస స్టేట్‌బ్యాంక్ వద్ద చంద్రమౌళికి నివాళులు అర్పిస్తున్న ఎస్‌బీఐ పెన్షనర్లు

తగరపువలస: జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో ఈనెల 22న జరిగిన ఉగ్రదాడిలో అశువులు బాసిన నగరానికి చెందిన రాష్ట్ర ఎస్‌బీఐ పెన్షనర్ల అసోషియేషన్ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ జరజాపు చంద్రమౌళికి చిట్టివలస ఎస్‌బీఐ పెన్షనర్లు గురువారం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పెన్షనర్లు ఉగ్రచర్యను తీవ్రంగా ఖండించారు. ఇలాంటి అమానవీయ దాడులతో భారతీయుల్లో ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయలేరన్నారు. వృత్తి, సమాజం పట్ల నిబద్ధత, నిజాయితీ కలిగిన చంద్రమౌళి వంటి ఉద్యోగులు అరుదుగా ఉంటారన్నారు. చంద్రమౌళి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. కార్యక్రమంలో పెన్షనర్ల తరపున ధాకా భాస్కరరావు, బెహరా మల్లేశ్వరరావు, బండారు ఎల్లాజీరావు, బ్రాంచ్ అకౌంటెంట్ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల శాంతి ర్యాలీ


తగరపువలసలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న అవంతి విద్యార్థులు

తగరపువలస: ఈ నెల 22న పహల్గాంలో ఉగ్రదాడులలో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి కలగాలని కోరుతూ చెరకుపల్లి అవంతి విద్యార్థులు గురువారం సాయంత్రం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ షరీఫ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును సందర్శించిన ఇన్‌చార్జి మంత్రి


జిందాల్ ప్లాంట్ వద్ద సిబ్బందితో మంత్రి బాలవీరాంజనేయస్వామి

మధురవాడ: జీవీఎంసీ జోన్–2 పరిధిలోని కాపులుప్పాడ డంపింగ్‌యార్డును జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోల బాలవీరాంజనేయస్వామి, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవరావు గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఇక్కడ జిందాల్ పవర్‌ప్లాంట్‌లో జరుగుతున్న కార్యకలాపాలను పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా తిలకించారు. ఇక్కడికి చెత్త ఎక్కడ నుంచి ఎలా తరలిస్తున్నారు, బుగ్గి ఉపయోగిస్తున్న పద్ధతులు, వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్, చెత్త విభజన తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌హెచ్ కాలనీలో ఉచిత నేత్రశిబిరం

పీఎం పాలెం: స్థానిక ఆర్‌హెచ్ కాలనీ కమ్యూనిటీ హాల్లో గురువారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి స్పందన లభించింది. నగరానికి చెందిన నియోవిజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో పరిసర ప్రాంత ప్రజలకు కంటి పరీక్షలు చేశారు. శస్త్రచికిత్స అవసరమైన వారి పేర్లను నిర్వాహకులు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో నియోవిజన్ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి


నినదిస్తున్న స్థానికులు

కొమ్మాది: ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో దానిని కాపాడాలంటూ స్థానికులే డిమాండ్ చేసిన సంఘటన తిమ్మాపురంలో చోటు చేసుకుంది. వివరాలివి.. జీవీఎంసీ 4వ వార్డు తిమ్మాపురంలో ఓ వ్యక్తి 120 గజాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి, బోరు వేసి మంచినీటి వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాడు. దీనితో ఆగకుండా ఆక్రమిత స్థలంలో ఐదు రోజుల క్రితం ఒక షెడ్ ఏర్పాటు చేశాడు.దీంతో స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించకపోవడంతో గురువారం ఉదయం స్థానికులే రంగంలోకి దిగి ప్రభుత్వ స్థలాన్ని అధికారులు రక్షించాలంటూ డిమాండ్ చేశారు. స్థానిక నాయకుడు బుద్దల గురయ్య మాట్లాడుతూ ఇక్కడ ప్రభుత్వ స్థలం ఆక్రమించడంతో పాటు రహదారిని కూడా కబ్జా చేశారని తెలిపారు. ఇక్కడ 1983లో 21 పట్టాలు మంజూరు కాగా, అనివార్య కారణాల వలన 18 పట్టాలు రద్దయ్యాయన్నారు. అయితే నకిలీ పట్టాలను చూపించి సదరు వ్యక్తి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తున్నా రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఆక్రమించిన వ్యక్తి వద్ద భూమికి సంబంధించిన ఎటువంటి పత్రాలు లేవన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి ఇక్కడ నిర్మించిన షెడ్‌ను తొలగించకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని స్పష్టం చేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తగరపువలస: చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ సంగివలస ఫీడర్‌లో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ అంతరాయం కారణంగా అనిట్స్ కళాశాల, ఎన్ఆర్ఐ ఆస్పత్రి, సంగివలస దేవరవారి కళ్లాలు, ఊళ్లపేట, సంగివలస, ఇడదాసరిపేట, నమ్మివానిపేట, చిల్లపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఆనందపురం మండలంలో..

తగరపువలస: ఆనందపురం మండలం పెద్దిపాలెం, బోని ఇండస్ట్రియల్ ఫీడర్లలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని అధికారులు తెలిపారు. ఈ కారణంగా పెద్దిపాలెం, ఆనందపురం సుఖీభవ లేఅవుట్, పొడుగుపాలెం ఇండస్ట్రియల్ ఏరియా, ఏనుగులపాలెం, చందక, జగన్నాథపురం, గొట్టిపల్లి, కుసులవాడ, వెంకటాపురంలలో గృహ, పారిశ్రామిక అవసరాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య


సుధీర్(ఫైల్)

తగరపువలస: ఆనందపురం మండలం, పొడుగుపాలెం దండువారి కళ్లాలకు చెందిన దొంతల సుధీర్ (29) తీవ్ర మనస్తాపానికి గురై గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుని తండ్రి అప్పలనాయుడు ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. సుధీర్ రెండేళ్ల కిందట తల్లిని కోల్పోవడంతో అప్పటి నుంచి మనస్తాపంతో బాధపడుతున్నాడు. ఇటీవల పచ్చ కామెర్లు కూడా రావడంతో మరింత కుంగిపోయాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం బంధువుల వ్యవసాయ భూమిలో గడ్డి మందు తాగాడు. అనంతరం దాహం వేయడంతో తన అన్న కుమారుడు రమేష్‌కు ఫోన్ చేసి నీరు తీసుకురావాలని కోరాడు. రమేష్ అక్కడికి చేరుకునే సమయానికి సుధీర్ అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతన్ని సంగివలస అనిల్ నీరుకొండ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో బుధవారం రాత్రి 9 గంటలకు నగరంలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం సుధీర్ మృతి చెందాడు. అతనికి ఒక సోదరుడు, ఒక సోదరి ఉన్నారు. ఆనందపురం ఎస్ఐ పి.శివ ఆధ్వర్యంలో హెచ్‌సీ పి.ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'అప్పలనాయుడిపై ఆరోపణలు సరికాదు'

తగరపువలస: ఆనందపురం మండలం చందక పంచాయతీలో తన తల్లిదండ్రుల పేరుతో ఉన్న 0.69 సెంట్ల భూమికి రక్షణ కల్పించాలని మండల ప్రజా సంక్షేమ నాయకురాలు మీసాల శ్రీదేవి కోరారు. గురువారం ఆమె మాట్లాడుతూ తన భర్త మీసాల అప్పలనాయుడిపై నగరానికి చెందిన కుంచంగి లక్ష్మి చేసిన ఆరోపణలు నిజం కాదన్నారు. ఆమెపై ఏపీ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

అలరించిన చిన్నారుల సంగీతం

తగరపువలస: ఆనందపురం మండలం పాలవలస పంచాయతీ గుడిలోవ భారతి కళా విహార వార్షికోత్సవం సందర్భంగా గురువారం చిన్నారుల సంగీత ప్రదర్శన ఏర్పాటు చేశారు. 46 మంది విద్యార్థులు వివిధ కృతులు, వర్ణనలు, దేశభక్తి, సామాజిక గీతాలతో ఆహూతులను అలరించారు. ఆల్ ఇండియా గ్రేడ్ ఆర్టిస్ట్ ఆర్ఎస్ఎస్ ఆనందపురం ఖండకార్యవాహ బాలి రవి పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో దళితులకు రక్షణ కరువు


సంతపేటలో మాట్లాడుతున్న మాజీ కౌన్సిలర్ జీవీ రమణ

తగరపువలస: కూటమి ప్రభుత్వంలో దళితులకు రక్షణ లేదని స్థానిక దళిత నాయకులు జీవీ రమణ, పందిరి విజయ్, సిమ్మల ప్రసన్న అన్నారు. ఇటీవల కాకినాడ జిల్లా పిఠాపురంలో జరిగిన సంఘటనే దీనిని రుజువు చేసిందన్నారు. ఒకటోవార్డు సంతపేటలో మాతా రమాభాయి అంబేడ్కరు కళావేదిక వద్ద గురువారం వారు మాట్లాడారు. దేశమంతా అంబేడ్కర్ ఆశయాలతో ముందుకు వెళ్తుంటే, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నియోజకవర్గంలో మాత్రం విరుద్ధంగా ఉందన్నారు. దళిత యువకుడు చనిపోతే నిరసన తెలిపిన తోటి దళిత సోదరులపై ఆంక్షలు విధించడాన్ని తప్పుబట్టారు. దళితులను అణగదొక్కాలని చూస్తే రాష్ట్రంలో దళితులంతా ఏకమై ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అమానుషమైన గ్రామ బహిష్కరణ జరిగితే, ఇప్పటి వరకు చంద్రబాబు, పవన్‌లు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు.

కూటమి పాలనలో రెడ్‌బుక్ రాజ్యాంగం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్‌రెడ్డి, అక్కరమాని చినబాబు, సృజన, అప్పారావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ దళితులకు ఇచ్చిన ప్రాధాన్యతను గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అంబేడ్కరు రాజ్యాంగాన్ని పక్కన పెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగం కొనసాగిస్తోందన్నారు. పిఠాపురం వంటి సంఘటనలు ప్రభుత్వ వైఫల్యాలకు నిదర్శనమన్నా రు.బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.


పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

విద్యార్థుల ఇంటిబాట పట్టిన ఉపాధ్యాయులు


విద్యార్థుల ఇంటికి వెళ్లిన అంబేడ్కర్ జీవీఎంసీ హైస్కూల్ ఉపాధ్యాయులు

తగరపువలస: జీవీఎంసీ ఒకటోవార్డు సంతపేట అంబేడ్కర్ హైస్కూల్లో ప్రవేశాల కోసం ఉపాధ్యాయులు గురువారం విద్యార్థుల ఇంటిబాట పట్టారు. వారు మాట్లాడుతూ ఇటీవల పదో తరగతి పరీక్ష ఫలితాలలో తమ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమంగా 567, 565, 544 మార్కులు సాధించారన్నారు. ఇదంతా ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం వలనే సాధ్యపడిందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా సంతపేట, కొండపేట, బంగ్లామెట్ట గ్రామాలలో 50 మంది విద్యార్థులను హైస్కూల్‌లో చేర్పించారు. ఇంటింటా ప్రచార కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెడ్డిపల్లి అప్పలరాజు, చిన్నంనాయుడు, జగదీష్, జి.కనకరాధ, శ్రీనివాసరావు, సత్యలక్ష్మి, బలరాం, మహాలక్ష్మి, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ భాస్కరరావుకు సీపీ రివార్డు


ఎస్ఐ భాస్కరరావును సత్కరిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

మధురవాడ: విధి నిర్వహణలో ప్రతిభ కనబరచడంతో పాటు ఒక యువతి ప్రాణాలు కాపాడడంలో కీలక పాత్ర పోషించిన పీఎం పాలెం ఎస్ఐ కె.భాస్కరరావు, హెచ్‌సీ విజయ్‌కుమార్‌లను నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి అభినందించారు. విశాఖలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో వారికి రివార్డులు మంజూరు చేశారు. ఈ నెల 2వ తేదీన ఓ ప్రేమోన్మాది తల్లీకూతుళ్లపై దాడికి చేయడంతో, ప్రాణాపాయంలో ఉన్న కుమార్తెను వీరిద్దరూ అందుబాటులో ఉన్న ద్విచక్ర వాహనంపై ఆస్పత్రికి తరలించి, బాధితురాలిని రక్షించిన విషయం విదితమే. దీంతో వారిని సీపీ సత్కరించి, రివార్డు మంజూరు ఆర్డర్ అందించారు.

విద్యార్థులకు ఉచిత వేసవి శిక్షణ

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో నెల రోజుల పాటు నిర్వహించనున్న ఉచిత వేసవి శిక్షణ తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. వచ్చే నెల 24 వరకు ఈ శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. రోజుకు రెండు గంటల పాటు ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు అంకెలు, యోగాసనాలు, శ్లోకాలు, పద్యాలు, తెలుగులో ద్విత్వాక్షరాలు, సంయుక్తాక్షరాలు, శ్రీమద్రామయణంలో బాలకాండ నేర్పుతారు. ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు యోగాసనాలు, తెలుగు చదవడం, రాయడం, చిత్రలేఖనం, ఇంగ్లిష్ నేర్పుతారు. సుపథ ఆధ్వర్యంలో ఈ తరగతులు నిర్వహిస్తున్నారు.

విద్యావలంటీర్లకు పూర్వ విద్యార్థుల సత్కారం


విద్యావలంటీర్లను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పద్మనాభం: మద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007–08 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు, తమకు అప్పట్లో తరగతులు బోధించిన విద్యావలంటీర్లను గురువారం సత్కరించారు. మద్ది రామకోటి ఆశ్రమంలో విద్యార్థులు కలిసి, వారిని సత్కరించారు. ఈ పాఠశాలలో పదో తరగతి ఇదే మొదటి బ్యాచ్. ఈ బ్యాచ్‌లో 25మంది విద్యార్థులు చదివారు. అప్పట్లో వీరికి ప్రభుత్వపరంగా ముగ్గురు ఉపాధ్యాయులే ఉండేవారు. దీంతో గ్రామంలో ఉన్న ఎనిమిది మంది పాఠశాలలో రూ.2వేలు వేతనానికి ప్రభుత్వ విద్యావలంటీర్లుగా చేరి, వీరికి విద్య బోధించారు. దీంతో వారిని సన్మానించారు. అప్పుడు విద్యా వలంటీర్లుగా పని చేసిన వారిలో ప్రస్తుత ఎంపీపీ కంటుబోతు రాంబాబు, అప్పట్లో విద్యార్థిగా మద్ది ప్రస్తుత సర్పంచ్ బుగత సన్యాసమ్మ ఉన్నారు.